సాక్షి
ప్రకాశం
సోమవారం । 21 । ఆగస్టు । 2023



టెంట్ హౌస్ దగ్ధమై వ్యక్తి మృతి

టెంట్‌హౌస్ దగ్ధమై వ్యక్తి మృతిచెందిన ఘటన దర్శి పట్టణంలో ఆదివారం జరిగింది. రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం చోటుచేసుకుంది. - 8లో..



మొక్కు తీర్చుకుని వస్తుండగా..

మొక్కు తీర్చుకుని ఆటోలో వస్తుండగా లారీని ఢీకొని నలుగురికి గాయాలైన ఘటన అద్దంకిలోని దర్శి రోడ్డులో చోటుచేసుకుంది. - 8లో..

గరిష్టం/కనిష్టం
37/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పంచాయతీ ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే ప్రభంజనం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి




ఒంగోలు: పంచాయతీ ఎన్నికల్లోను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే ప్రభంజనం అని పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 66 సర్పంచ్ పదవులకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిందన్నారు. అందులో 30 స్థానాలను, ఎన్నికలు జరిగిన వాటిలో 23 స్థానాలను వెరసి 53 చోట్ల వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు విజయఢంకా మోగించారన్నారు. టీడీపీ కేవలం 10 స్థానాలకు, జనసేన ఒక్క స్థానానికి పరిమితమైనట్లు పేర్కొన్నారు. వార్డులకు వెలువడిన నోటిఫికేషన్‌కు సంబంధించి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు 810 స్థానాలలో, టీడీపీ సానుభూతిపరులు 182 చోట్ల, జనసేన మద్దతుదారులు 7 చోట్లకు మాత్రమే పరిమితయ్యారన్నారు. దీనిని బట్టి పంచాయతీ ఎన్నికల్లోను వైఎస్సార్‌సీపీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. జిల్లా పరిధిలో జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే ఒక సర్పంచ్ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకుందని, వార్డులకు సంబంధించి 63 వార్డులకు నోటిఫికేషన్ వెలువడితే 41 స్థానాలను వైఎస్సార్‌సీపీ, టీడీపీ 21 స్థానాలను కైవసం చేసుకున్నారన్నారు. మరో స్థానంలో ఎన్నిక జరగలేదని చెప్పారు. దీనిని బట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు ఎలాంటి మద్దతు ఇస్తున్నారో స్పష్టమైందన్నారు. ఇందుకు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు అండగా నిలిచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు.

ఉప పోరులోనూ ఫ్యాన్ హవా...

అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువైన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజామద్దతు ప్రతి ఎన్నికల్లోనూ ప్రస్ఫుటమవుతోంది. గ్రామ పంచాయతీల ఉప ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులు విజయదుంధుభి మోగించారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన వాటిలో మెజార్టీ స్థానాలను దక్కించుకుని విజయ పరంపరను కొనసాగించారు. నామినేషన్ల దశలోనే అత్యధిక ఏకగ్రీవాలతో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులు దక్కించుకున్నారు. ఎన్నికలు జరిగిన స్థానాల్లోనూ ఎక్కువ స్థానాలు ఫ్యాన్‌పరమయ్యాయి.

- వార్డు, సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటిన వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు
- 63 వార్డుల్లో 41 వైఎస్సార్‌సీపీ పక్షం
- 21 స్థానాలకే టీడీపీ అభ్యర్థులు పరిమితం
- ఏ ఎన్నికలైనా వైఎస్సార్ సీపీకే పట్టం కడుతున్న జిల్లా ఓటర్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో గ్రామ పంచాయతీల వార్డు, సర్పంచ్ పదవులకు సంబంధించి జరిగిన ఉప ఎన్నికల్లో అధికార వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులు విజయ బావుటా ఎగురవేశారు. వివిధ కారణాలతో జిల్లాలో రెండు సర్పంచ్, 63 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో ఒక సర్పంచ్, 47 వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. పామూరు మండలంలోని ఒక వార్డుకు ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. మిగిలిన 15 వార్డులు, ఒక సర్పంచ్ స్థానానికి శనివారం పోలింగ్ నిర్వహించారు. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటంతో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నికల్లో ఎప్పటిలాగే అధికార పక్షానికే జిల్లావాసులు పట్టంకట్టారు. ఇప్పటికే సార్వత్రిక ఎన్నికల మొదలు స్థానిక సంస్థల ఎన్నికల వరకూ అధికార వైఎస్సార్ సీపీదే పైచేయిగా నిలిచింది. ప్రతిపక్ష టీడీపీ కనీస ఉనికిని కూడా చాటుకోలేక చతికిలపడింది. తాజాగా జరిగిన స్థానిక ఉపపోరులో కూడా గత ఫలితాలే ప్రస్ఫుటమయ్యాయి.



68.84 శాతం పోలింగ్...

పంచాయతీ ఉపపోరులో 68.84 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 11,681 ఓట్లకు గాను 8,041 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా ముండ్లమూరు మండలం పసుపుగల్లు పంచాయతీ 10వ వార్డులో 93.90 శాతం పోలింగ్ జరగగా అక్కడ వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి పోసిపోగు మాణిక ఘన విజయం సాధించారు. అత్యల్పంగా సింగరాయకొండ 16వ వార్డులో 47.42 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 873 ఓట్లకుగాను 414 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి షేక్ షాబిరా 262 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించింది.

- జిల్లాలో రెండు సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అందులో యర్రగొండపాలెం నియోజకవర్గంలోని అర్ధవీడు మండలం దొనకొండ పంచాయతీ సర్పంచ్ పదవి ఏకగ్రీవమైంది. గతంలో ఇక్కడ టీడీపీ బలపరిచిన అభ్యర్థి మరియమ్మ సర్పంచ్‌గా ఎన్నికై ఆమె చనిపోవడంతో ఆమె కోడలు ఎస్తేర్‌రాణిని సంప్రదాయాన్ని గౌరవిస్తూ వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకొని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొండపి నియోజకవర్గంలోని సింగరాయకొండ మండలం పాకల సర్పంచ్ పదవికి జరిగిన ఎన్నికల్లో టీడీపీ మద్దతు అభ్యర్థి సైకం చంద్రశేఖర్ 249 ఓట్ల మెజారిటీతో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కుర్రు ప్రసన్న కుమార్‌పై విజయం సాధించాడు.

వైఎస్సార్ సీపీదే...

ఉప ఎన్నికలు జరిగిన 63 వార్డుల్లో 41, రెండు సర్పంచ్ స్థానాల్లో ఒకటి అధికార వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు విజయ దుందుభి మోగించారు. టీడీపీ ఒక సర్పంచ్, 21 వార్డు స్థానాలకే పరిమితమైంది. పలు చోట్ల జనసేన మద్దతు అభ్యర్థులు పోటీ చేసినా కనీస ఉనికిని కూడా చాటుకోలేకపోయారు.

- కొండపి నియోజకవర్గంలో 14 వార్డులకు గాను 10 ఏకగ్రీవమయ్యాయి. అందులో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులు 9, టీడీపీ 1 దక్కించుకున్నాయి. పోలింగ్ జరిగిన నాలుగు వార్డుల్లో వైఎస్సార్ సీపీ, టీడీపీ చెరో రెండు స్థానాలు గెలుచుకున్నాయి. మొత్తంగా 12 వార్డులు వైఎస్సార్ సీపీ పరమయ్యాయి.
- గిద్దలూరు నియోజకవర్గంలో 15 వార్డులకు గాను 13 ఏకగ్రీవమయ్యాయి. అందులో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు 11, టీడీపీ మద్దతుదారులు 2 స్థానాల్లో ఏకగ్రీవమయ్యారు. పోలింగ్ జరిగిన 2 వార్డులూ వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులు గెలుచుకున్నారు. మొత్తంగా 13 వార్డులు వైఎస్సార్ సీపీ పరమయ్యాయి.
- కనిగిరి నియోజకవర్గంలో 13 వార్డులకు గాను 9 ఏకగ్రీవమయ్యాయి. అందులో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు 6, టీడీపీ మద్దతుదారులు 3 స్థానాలు దక్కించుకున్నారు. పోలింగ్ జరిగిన 4 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ 1, టీడీపీ 3.. మొత్తంగా 7 వార్డులు వైఎస్సార్‌సీపీ పరమయ్యాయి.
- యర్రగొండపాలెం నియోజకవర్గంలో 5 వార్డులకు గాను 4 ఏకగ్రీవమయ్యాయి. అందులో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు 2, టీడీపీ మద్దతుదారులు 2 స్థానాల్లో ఉన్నారు. పోలింగ్ జరిగిన 1 వార్డును వైఎస్సార్‌సీపీ గెలుచుకుంది. మొత్తంగా 3 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది.
- మార్కాపురం నియోజకవర్గంలో 4 వార్డులకు గాను 3 ఏకగ్రీవమయ్యాయి. అందులో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు 2, టీడీపీ మద్దతుదారు 1 స్థానంలో ఉన్నారు. పోలింగ్ జరిగిన 1 వార్డును వైఎస్సార్‌సీపీ గెలుచుకుంది. మొత్తంగా 3 వార్డులను వైఎస్సార్‌సీపీ సొంతం చేసుకుంది.
- దర్శి నియోజకవర్గంలో 4 వార్డులకు గాను 3 ఏకగ్రీవమయ్యాయి. అందులో మూడింటినీ టీడీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. పోలింగ్ జరిగిన 1 వార్డులో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి గెలిచారు.
- సంతనూతలపాడు నియోజకవర్గంలో 3 వార్డులకు గాను 2 ఏకగ్రీవమయ్యాయి. అందులో టీడీపీ మద్దతుదారులు రెండింటినీ గెలుచుకున్నారు. పోలింగ్ జరిగిన 1 వార్డులోనూ టీడీపీ మద్దతు అభ్యర్థి గెలుపొందాడు.
- ఒంగోలు నియోజకవర్గంలో 4 వార్డులకు గాను 3 ఏకగ్రీవమయ్యాయి. అందులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు 2, టీడీపీ మద్దతు అభ్యర్థి 1 స్థానం దక్కించుకున్నారు. పోలింగ్ జరిగిన 1 వార్డులో టీడీపీ మద్దతు అభ్యర్థి గెలిచారు.

ఉపపోరు ఇలా...

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో రెండు సర్పంచ్, 63 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈ నెల 6వ తేదీ విడుదల చేశారు. 8 నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 12, 13 తేదీల్లో అభ్యంతరాలను పరిగణలోకి తీసుకున్నారు. 14వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అదేరోజు తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి విడుదల చేశారు. ఒక సర్పంచ్, 47 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన ఒక సర్పంచ్, 15 వార్డు సభ్యుల స్థానాలకు 19వ తేదీన పోలింగ్ నిర్వహించారు. అదే రోజు సాయంత్రం ఫలితాలను కూడా విడుదల చేశారు.

మార్గదర్శిలో కొనసాగిన తనిఖీలు



సీఐడీ తనిఖీలు జరుగుతున్న మార్గదర్శి కార్యాలయం

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరం కర్నూలు రోడ్డులో మార్గదర్శి బ్రాంచిలో నాలుగో రోజు కూడా సీఐడీ తనిఖీలు కొనసాగాయి. ప్రతి ఆదివారం మార్గదర్శి కార్యాలయం కస్టమర్లతో చాలా బిజీగా ఉంటుంది. కొత్తగా చీటీలు వేసే వాళ్లు, పాత చీటీ తాలూకా పాటదారులు, వాయిదాలు కట్టాల్సిన వాళ్లు, ఏజెంట్లతో రద్దీగా ఉంటుంది. అయితే, మూడు రోజులుగా కొనసాగుతున్న తనిఖీల్లో అనేక అవకతవకలు, అక్రమాలు వెలుగు చూసినట్లు తెలుస్తోంది. కస్టమర్లకు తెలియకుండానే వారి పేరు మీద చీటీలు నడుపుతున్నట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. అనేక మంది చందాదారుల సంతకాలు లేకుండానే వారి పేర్ల మీద చీటీలు ఉన్నట్లు సీఐడీ అధికారుల దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇలాంటి చీటీల గురించి అధికారులు అడిగిన ప్రశ్నలకు మార్గదర్శి సిబ్బంది నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో నేరుగా రంగంలోకి దిగిన సీఐడీ అధికారులు కొందరు చందాదారులకు ఫోన్ చేసి మాట్లాడినట్లు తెలుస్తోంది. మొత్తం మీద సీఐడీ అధికారులకు కీలకమైన సాక్ష్యాలు లభ్యమైనట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న సీఐడీ అధికారులు మార్గదర్శిలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. తొలుత ఒక రోజు తనిఖీలు చేస్తే సరిపోతుందని భావించిన అధికారులకు కీలకమైన సమాచారం లభించడంతో తనిఖీలు కొనసాగించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే నాలుగు రోజులుగా తనిఖీలు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఇప్పుడు చందాదారులు మార్గదర్శి కార్యాలయం వద్దకు వస్తే అనలుకే ఎసరవుతుందని భావించిన మార్గదర్శి సిబ్బంది.. ఈసారి ఆదివారం చందాదారులను కార్యాలయం వద్దకు రాకుండా ఒక వ్యూహం ప్రకారం అడ్డుకున్నట్లు తెలుస్తోంది. నాలుగో రోజు కూడా మార్గదర్శి కార్యాలయం బయట ఈనాడు రిపోర్టర్లు, ఈటీవీ కెమెరామెన్ల కాపలా కొనసాగింది. తనిఖీల గురించి వార్తల సేకరణకు వెళ్లిన సాక్షి విలేకరితో ఈనాడు, ఈటీవీ సిబ్బంది వాదనకు దిగారు. మార్గదర్శి కార్యాలయం ఫొటోలు తీస్తే బాగుండదని బెదిరింపులకు పాల్పడ్డారు.

ఘనంగా నాగభైరవ పురస్కార ప్రదానోత్సవం



నాగభైరవ సాహిత్య పీఠం పురస్కారాలు అందుకుంటున్న కవులు, రచయితలు

ఒంగోలు మెట్రో: డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేరుమీద ఇచ్చే నాగభైరవ సాహిత్య పీఠం పురస్కారాలను ఆదివారం స్థానిక మల్లయ్య లింగం భవనంలో అందజేశారు. డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా పురస్కారాలు అందజేయడంపై అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు, కళామిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ నాగభైరవ కోటేశ్వరరావు కవిత్వమే ఊపిరిగా బతికారని అన్నారు. కథ సంపుటాలలో బహుమతులు పొందిన సింహప్రసాద్, శీలం సురేంద్ర, నాగేంద్ర కాశీలకు వరుసగా రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.2 వేల నగదు బహుమతులు అందజేశారు. నాగభైరవ కళా పురస్కారం కింద రూ.10 వేల నగదు బహుమతిని బీసీడి కృష్ణయ్యకు, నాగభైరవ ఆత్మీయ పురస్కారాన్ని కళారత్న భూసురపల్లి వెంకటేశ్వర్లుకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గుళ్లపల్లి సుబ్బారావు, చుండి వెంకన్నరావు, డాక్టర్ జక్కంపూడి సీతారామారావు, కందిమళ్ల సాంబశివరావు, కుర్రా ప్రసాద్‌బాబు, తేళ్ల అరుణ, యు.వి.రత్నం, కె.బాలకోటయ్య, వి.ఝాన్సీదుర్గ, బీరం అరుణ, గాదేపల్లి దివాకర్ దత్తు, బెజవాడ వెంకట్రావు, ఇనకొల్లు మస్తానయ్య, వీరబాబు డా.సంతవేలూరి కోటేశ్వరరావు, కేఎస్వీ ప్రసాద్, డాక్టర్ నాగభైరవ ఆంజనేయులు, కవులు, రచయితలు, కళాకారులు పాల్గొన్నారు.

జాతి గర్వించదగ్గ నేత అబ్దుల్ కలాం



ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



బాలినేనిని సత్కరిస్తున్న విగ్రహావిష్కరణ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ గఫూర్ తదితరులు

- అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: కుల మతాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఆరాధించే అద్భుతమైన వ్యక్తి, భరత జాతి గర్వించదగ్గ నాయకుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని మాజీమంత్రి, ఒంగోలు శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక రాజాపానగల్ రోడ్డులో ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆవిష్కరణ మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నిర్వహించిన సభలో బాలినేని మాట్లాడుతూ అత్యంత పేదరికం నుంచి ప్రారంభమైన కలాం జీవితం నేడు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయంగా మారిందన్నారు. భారతదేశపు తొలి క్షిపణి నిపుణుడిగా ఆయన అందించిన సేవలు నేడు భారతదేశానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయన్నారు. అటువంటి మహనీయుని విగ్రహాన్ని ఆవిష్కరించగలగడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. విగ్రహ ఏర్పాటుకు స్థల సమస్య ఉందని విగ్రహ కమిటీ ప్రస్తావిస్తే భరత జాతి గర్వించే ఆణిముత్యం విగ్రహానికి స్థల సమస్య ఏమిటి అంటూ అప్పటికప్పుడు పరిష్కరించగలిగామన్నారు. డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు మాట్లాడుతూ కలాం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విగ్రహ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ గఫూర్ ప్రస్తావించగానే దానికి బాలినేని తక్షణమే ఆమోదం తెలిపారన్నారు. అందులో భాగంగా విగ్రహానికి దాతగా కూడా బాలినేని వ్యవహరించారన్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి అన్న సంతర్పణ కార్యక్రమంలో బాలినేని పాల్గొన్నారు. బాలినేనిని విగ్రహావిష్కరణ కమిటీ అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ గఫూర్, ఉపాధ్యక్షుడు చెన్నంశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి షేక్ మస్తానవలి, సహాయ కార్యదర్శి రెడ్డి కిరణ్‌కుమార్, కోశాధికారి షేక్ జాకీర్‌హుస్సేన్‌లు బాలినేనిని ఘనంగా సత్కరించారు. మరో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ ఫాతిమాబి, ముస్లిం మైనార్టీ రీజినల్ కోఆర్డినేటర్ సయ్యద్ జలీల్, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ షేక్ మహబూబ్‌భాషా, షేక్ అజీజ్ మొహిద్దీన్, సయ్యద్ ఇమాం సాహెబ్, షాజహాన్, ఏపీ టైలర్ల ఫెడరేషన్ చైర్మన్ షేక్ మస్తాన్‌బీ, తాడి కృష్ణలత, గొర్రెపాటి శ్రీనివాసరావు, మాబు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలిచ్చాకే ఎన్నికలకు వెళ్తాం..

ఒంగోలు నగరంలోని అర్హులైన పేదలందరికీ పట్టాల పంపిణీ చేపట్టిన తరువాతనే ఎన్నికలకు వెళ్తామని బాలినేని అన్నారు. సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా 25 వేల మందికి పట్టాలు పంపిణీ చేపడతామని చెప్పారు. పగటిపూటే మంచినీరు ఇచ్చేలా ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల మార్పిడి కార్యక్రమాన్ని కూడా సీఎం చేతులమీదుగా శంకుస్థాపన కార్యక్రమం చేపడతామని తెలిపారు.

ఆదుకుంటేనే ఆయువు

- మెదడువాపుతో ఏడాదిగా మంచం పట్టిన విద్యార్థిని మనీషా
- ముక్కు ద్వారా ద్రవాహారం అందజేత
- ఆర్థిక సహాయం కోసం ఎదురు చూపులు



మంచంలో ఉన్న మనీషాతో తల్లి సునీత, అక్క అనూష

మద్దిపాడు: నేరుగా ఆహారం, శ్వాస తీసుకోలేదు. ముక్కులో పైపుల సహాయంతో ద్రవాహారం, శ్వాస తీసుకునేందుకు గొంతులో పైపులు వేశారు. ఏడాదిగా మంచానికే పరిమితమై వైద్యం చేయించుకునే స్తోమతలేక దాతల సాయం కోసం ఎదురుచూస్తోందా బాలిక. మద్దిపాడు మండలం జువ్విగుంట గ్రామ ఎస్సీకాలనీకి చెందిన పల్లెపోగు దావీదు, సునీతలకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నలుగురు సంతానంలో మూడో కుమార్తె అయిన పల్లెపోగు మనీషా మండలంలోని తంగెళ్ల హైస్కూల్లో పదో తరగతి చదువుతోంది. మంచి మెరిట్ కలిగిన విద్యార్థి అయిన మనీషాకు ఓ రోజు జ్వరం వచ్చింది. బంధువులు వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు అనంతరం వైద్యులు ఆమెకు మెదడువాపు ఉన్నట్లుగా గుర్తించారు. ఆపరేషన్ చేస్తేనే అమ్మాయి బతికేది. లేకపోతే చనిపోతుందని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు తల్లడిల్లారు. రోజువారి కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆ కుటుంబానికి పెద్ద కష్టం వచ్చిపడింది. ఏం చేయాలో తోచని పరిస్థితిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో మనీషాకు చికిత్స చేయించారు. మెదడులో వాపు తగ్గితే తప్ప ఆపరేషన్ చేయలేమని చెప్పడంతో మూడు నెలల పాటు ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స చేశారు. ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం ఇచ్చిన రూ.5 లక్షలతో పాటు వారి సొంత డబ్బులు మరో రూ.5 లక్షలు ఖర్చుచేసినా పూర్తిగా కోలుకోలేదు. అప్పటికే ఆరోగ్యశ్రీ పరిధి దాటిపోవడంతో గత్యంతరం లేక ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఏడాది నుంచి మందులు వాడుకుంటూ నెట్టుకొస్తున్నారు. మనీషా ముక్కులో పైపుల సహాయంతో ఆహారాన్ని ద్రవ రూపంలో అందజేస్తున్నారు. శ్వాస తీసుకునేందుకు గొంతులో పైపులు వేశారు. కుమార్తెకు నెలకు వైద్యానికి రూ.15 వేలు ఖర్చవుతున్నాయని తల్లి సునీత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచం పట్టిన మనీషాకు ఆర్థిక సహాయం చేయాలని తల్లిదండ్రులు దాతలను కోరుతున్నారు. ఏడాది నుంచి మంచంలో ఉన్న మనీషాను ఎడమ కన్నులోపించి పాక్షికంగా అంధురాలైన అక్క అనూషా అన్ని తానై సపర్యలు చేస్తూ దగ్గరుండి మరీ చూసుకుంటోంది. అప్పుచేసి ఇప్పటి వరకు దాదాపు రూ.3 లక్షలు వరకు ఖర్చు చేశామని, అయినా తన బిడ్డ కోలుకోలేదని తల్లి సునీత కంటనీరు పెట్టింది. చిన్న కుమార్తె కోసం పెద్ద కూతురు అనూషా డిగ్రీ మధ్యలోనే ఆపివేసిందని తెలిపింది. మంచం పట్టిన మనీషాకు ఆర్థిక సహాయం చేసి, పాక్షికంగా అంధురాలైన నా పెద్ద కుమార్తె అనూషాకు వికలాంగ సర్టిఫికెట్ అందజేసి పింఛన్ మంజూరు చేయాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఆర్థిక సహాయం చేయదలచిన దాతలు సెల్‌నంబర్ 6302575798 ను సంప్రదించగలరని వారు కోరారు.

తెలుగువారి కీర్తిపతాకలు ఎస్వీఆర్, ఎన్టీఆర్



పురస్కారాలు అందుకుంటున్న పొన్నూరు శ్రీనివాసులు, తన్నీరు మోహన్‌రావు

- ఘనంగా ఎస్వీఆర్, ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానం

ఒంగోలు మెట్రో: పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాల్లో అనేక పాత్రలకు ప్రాణప్రతిష్ట చేసి తెలుగువారి కీర్తిపతాకలుగా నిలిచిన మహానటులు ఎస్వీఆర్, ఎన్టీఆర్ అని పద్మశ్రీ ఘంటసాల, మొవ్వ సీతారామయ్య-బసవమ్మ సాంస్కృతిక సేవాసంస్థ అధ్యక్షుడు మొవ్వ నాగేశ్వరరావు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ లో ఎస్వీఆర్, ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులకు విశ్వనట చక్రవర్తి ఎస్వీ రంగారావు పురస్కారాన్ని, బాపట్ల డీపీఆర్‌ఓ తన్నీరు మోహన్ రాజుకు నందమూరి తారక రామారావు పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన సంగీత విభావరిలో గాయనీ గాయకులు మొవ్వ నాగేశ్వరరావు, పెండ్యాల సాయి మాస్టర్, సూరి రమేష్ బాబు, ఆకుల శ్రీను, బాలకృష్ణ, రాజేష్, పలువురు గాయనీ గాయకులు పాడిన పాటలు అలరించాయి. ముందుగా నగర ప్రముఖులు, కళాకారులు కేఎస్వీ ప్రసాద్, షేక్ మహబూబ్ జాన్, మామూర్తి, నూకతోటి శరత్, ఎన్నూరి నాగేశ్వరరావు, పాలూరి శివప్రసాద్, సయ్యద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొని ఎన్టీఆర్, ఎస్వీఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా గుర్రం కృష్ణ వ్యవహరించారు.

హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి విజేత విశాఖ జట్టు



తృతీయ స్థానం సాధించిన ప్రకాశం జట్టు



హ్యాండ్‌బాల్ ఫైనల్ పోటీలో తలపడుతున్న విశాఖ-కర్నూలు జట్లు

ఒంగోలు: హ్యాండ్‌బాల్ పురుషుల విభాగం రాష్ట్రస్థాయి విజేతగా విశాఖ జిల్లా జట్టు నిలిచింది. స్థానిక మినీ స్టేడియంలో ఆదివారం ముగిసిన రాష్ట్రస్థాయి 9వ పురుషుల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో విశాఖ జట్టు కర్నూలు జట్టుపై తలపడింది. ఈ పోటీలో విశాఖ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, కర్నూలు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆతిథ్య ప్రకాశం జట్టు తృతీయస్థానంతో సరిపెట్టుకుంది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టును ప్రకటించారు. ఎంపికైన క్రీడాజట్టు సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహిస్తుంది. అనంతరం పోటీల ముగింపు కార్యక్రమంలో భాగంగా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జె.కోటేశ్వరరావు, పి.విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ వై.శీనయ్య, పి.విజయ్‌కుమార్, సత్యం, గురుప్రసాద్ తదితరులు పాల్గొని విజేత జట్లకు ట్రోఫీలు అందించారు.

క్లుప్తంగా

మొక్కు తీర్చుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదం

- నలుగురికి గాయాలు
- క్షతగాత్రులంతా ఒకే కుటుంబం వారు


చికిత్స పొందుతున్న సులోచనాదేవి

అద్దంకి రూరల్: కుటుంబ సభ్యులంతా కలిసి సంతోషంగా దేవుడి మొక్కు తీర్చుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అందులో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం అద్దంకి పట్టణం దర్శి రోడ్డులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా దర్శిలోని ఏకలవ్యనగర్‌కు చెందిన బత్తుల సురేష్‌బాబు కుటుంబ సభ్యులు 11 మంది బల్లికురవ మండలంలోని గొర్రెపాడు గ్రామంలో అంకమ్మతల్లి దేవస్థానంలో మొక్కులు తీర్చుకునేందుకు ఆటోలో వెళ్లారు. అమ్మవారి మొక్కులు తీర్చు కుని తిరిగి సాయంత్రం అదే ఆటోలో ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలోని అద్దంకిలో దర్శి రోడ్డుపై వెనుకకు రివర్స్ చేసుకుంటున్న లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో నడుపుతున్న బత్తుల సురేష్‌కు, ఆయన తల్లి సులోచనాదేవికి, కుమారుడు కృష్ణతేజకు, తమ్ముడి కుమారుడు మహేష్‌బాబుకు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన కుటుంబ సభ్యులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వారిలో అపస్మారక స్థితిలో ఉన్న మహేష్‌బాబును ముందుగా మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. క్షతగాత్రులు సురేష్‌బాబు, సులోచనాదేవి, కృష్ణతేజలకు ప్రథమ చికిత్స అందించి ఒంగోలు తరలించారు.


క్షతగాత్రులు సురేష్‌బాబు, కృష్ణతేజ

శుభ శ్రావణం..

- శ్రావణమాసంతో శుభకార్యాలకు మంచి ముహూర్తాలు
- రెండు నెలల విరామం అనంతరం గృహ ప్రవేశాలు, వివాహాలు
- ఒక్కటికానున్న వేలాది జంటలు
- కళ్యాణ మండపాలకు డిమాండ్


ముస్తాబైన కళ్యాణ మండపం

ఒంగోలు మెట్రో: వేదమంత్రాల మధ్య ఒకటవుతున్న నూతన జంటలకు శ్రావణమాసం స్వాగతం పలుకుతోంది. ఆషాఢమాసం, అధిక శ్రావణాల తరువాత రెండు నెలల విరామం అనంతరం శుభకార్యాలకు శుభ ముహూర్తాలు వచ్చాయి. జూన్ 19వ తేదీ మొదలైన ఆషాఢ మాసం, జూలై 18న ప్రారంభమైన అధిక శ్రావణ మాసం రెండు నెలల పాటు శుభకార్యాలకు ముహూర్తాలు లేవు. శ్రావణమాసం వచ్చేయడంతో ఈ నెలలో 22, 24, 26, 29, 30, 31, సెప్టెంబర్ నెల 1, 2, 3, 6, 7, 8 తేదీల్లో వివాహాలకు, గృహప్రవేశం, గృహారంభానికి బలమైన ముహూర్తాలు ఉన్నాయి. ఆగస్టు 27 నుంచి 30వ తేదీ వరకు మంచి ముహూర్తాలు ఉండటంతో ఆ రోజుల్లో అధిక సంఖ్యలో వివాహాలు జరుగుతున్నాయి. జిల్లాలో దాదాపు 3 వేలకుపైగా జంటలు ఈ శ్రావణమాసంలో ఒక్కటికానున్నాయి. ఇప్పటికే ముహూర్తాలు పెట్టుకున్న వారి ఇళ్లలో పెళ్లి హడావుడి మొదలైంది. శ్రావణ మాసంలో వచ్చే నోములు, వ్రతాలకు వివాహ శుభకార్యాలకు అవసరమయ్యే కళ్యాణ మండపాలు, పూలవాళ్లకు, డెకరేషన్, క్యాటరింగ్ వాళ్లకు, పురోహితులకు మంచి గిరాకీ ఏర్పడింది. కళ్యాణ మండపాలకు ముందస్తు బుకింగ్‌లు చేసుకుంటున్నారు. ధరలు కూడా గత ఏడాదితో పోల్చితే పెరిగాయి.

శ్రావణాన లక్ష్మీ అనుగ్రహం:
శ్రీ మహావిష్ణు జన్మ నక్షత్రం శ్రవణానక్షత్రం. ఆ నక్షత్రం పేరు మీద ఏర్పడిన శ్రావణమాసంలో మహాలక్ష్మీ దేవిని పూజించడం, దీపారాధన చేయడం వలన ఎప్పుడూ మహాలక్ష్మీదేవి అనుగ్రహం కలిగి ఉంటారని భక్తుల నమ్మకం. శ్రావణ శుక్రవారంలో మహిళలు మహాలక్ష్మీ దేవి స్వరూపంగా భావించి సాటి ముత్తైదువులకు తాంబూలం ఇస్తారు. శ్రావణ పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు. శ్రావణ మాసంలో వచ్చే నాగపంచమి, లేదా గురుడ పంచమి, సూర్యషష్టి, పుత్రద ఏకాదశి, రాఖీ పౌర్ణమి, శ్రీ కృష్ణాష్టమి, హయగ్రీవ జయంతి, పోలాల అమవాస్య నాడు భక్తులు వ్రతాలు ఆచరించి ఆయా దేవతలను పూజిస్తారు. తిథులతో సంబంధం లేకుండా అష్టమి, నవమి అమావాస్య రోజుల్లో కూడా పండుగలు, పూజలు చేసే అత్యంత శుభ్రమైనది శ్రావణమాసం.

రెండు నెలల తరువాత మంచి ముహూర్తాలు



శ్రావణమాసం ఆగస్టు నెలలో 18, 19, 20, 22, 24, 26, 29, 30, 31, సెప్టెంబర్ నెలలో 1, 2, 3, 6, 7, 8, వివాహ, గృహారంభ గృహ ప్రవేశానికి మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఆగస్టు 27 నుంచి 30వ తేదీ వరకు, బలమైన ముహూర్తాలు ఉండటం వల్ల ఆ తేదీల్లో అధిక సంఖ్యలో వివాహ శుభకార్యాలు జరుగుతున్నాయి. జ్యేష్ఠ మాసం తర్వాత రెండు నెలలు వివాహాది శుభకార్యాలకు ఆషాఢం, అధిక శ్రావణం, శుక్ర మూఢమితో సకల శుభకార్యాలకు ఆటంకం ఏర్పడింది.

– కప్పుర రామకుమార శర్మ, పురోహితుడు, ఒంగోలు

ఈ సీజన్‌లో మంచి డిమాండ్



మళ్లీ పెళ్లిళ్ల సీజన్ వచ్చింది. ఈ నెల రోజులూ మంచి డిమాండ్ ఉంటుంది. వివాహ శుభకార్యాలకు యజమానులు ఎంచుకున్న కళ్యాణ మండపాలను బట్టి కనీసం రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు వసూలు చేస్తున్నాం.

– రామకృష్ణ, డెకరేషన్ నిర్వాహకుడు, ఒంగోలు

కళ్యాణ మండపాలు కళకళ



శ్రావణమాసం రావడంతో ఈ సీజన్‌లో కళ్యాణ మండపాలు కళకళలాడుతాయి. ఏసీ కళ్యాణ మండపానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష మండప నిర్వహణకు వసూలు చేస్తున్నాం. నాన్ ఏసీ కళ్యాణ మండపాలకు అద్దె తక్కువ ఉంటుంది.

– అనిల్ కుమార్, కళ్యాణ మండపం మేనేజర్

క్రయవిక్రయాల సమయంలో జాగ్రత్తగా ఉండాలి


ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: ఆన్‌లైన్ సైట్లలో సెకండ్ హ్యాండ్ వస్తువుల క్రయవిక్రయాల సమయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి పొరపాటు చేసినా జేబులు గుల్లవుతాయని ఎస్పీ మలికాగర్గ్ హెచ్చరించారు. ఆ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత సమాజంలో మోసాలు జరుగుతున్న తీరు గురించి వివరించారు. ఆన్‌లైన్‌లో కొందరు కేటుగాళ్లు తమ వద్ద కొత్త వస్తువులు ఉన్నాయని, వాటిని ఎక్కువ రోజులు వాడలేదని, డబ్బు అవసరమై సగం రేటుకే విక్రయిస్తున్నామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వాధికారులమంటూ కొంత మంది, అధికారులమంటూ మరికొందరు తక్కువ ధరలకే కార్లు, కెమెరాలు విక్రయిస్తున్నట్టు నమ్మించి మోసాలు చేస్తున్నారని తెలిపారు. ఏవైనా పాత వస్తువులు అమ్మదలచినప్పుడు కొందరు మోసగాళ్లు ఎంత ధరైనా పర్వాలేదు తాము కొంటామని ఫోన్లు చేస్తారని, అందుకుగానూ క్యూఆర్ కోడ్ పంపించి పేమెంట్ చేయడానికి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయమని కోరతారని వివరించారు. తద్వారా మీ అకౌంటులోని డబ్బు కాజేస్తారని తెలిపారు. మరికొందరు ఒక లింక్ పంపించి క్లిక్ చేయమని చెబుతారని, అనంతరం మీ బ్యాంకు వివరాలు తెలుసుకుని టోకరా వేస్తారని వివరించారు. అందువలన క్రయవిక్రయాలు జరిపేటప్పుడు ప్రకటనలు చూసి నమ్మవద్దని, తక్కువ ధరకు వస్తుంది కదా అని ఏ సైట్ పడితే ఆ సైట్లో కొనకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపించే క్యూఆర్ కోడ్ ద్వారా డబ్బు చెల్లించడమంటే అందులో ఏదో తిరకాసు ఉందన్న విషయం తెలుసుకోవాలని చెప్పారు. ఏదైనా మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

సింగరాజు వెంకట్రావు సేవలు చిరస్మరణీయం

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి


కేక్ కటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రణీత్‌రెడ్డి, సింగరాజు మీనా వెంకట్రావు, నాయకులు

ఒంగోలు: వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షునిగా పనిచేసిన దివంగత సింగరాజు వెంకట్రావు సేవలు చిరస్మరణీయమని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కొనియాడారు. ఆదివారం వెంకట్రావు జయంతి సందర్భంగా స్థానిక బధిరుల ఆశ్రమ పాఠశాలలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కావటి రవికుమార్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో బాలినేని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్, సింగరాజు వెంకట్రావు సతీమణి సింగరాజు మీనా వెంకట్రావుతో కలిసి ఎమ్మెల్యే బాలినేని కేక్ కట్ చేశారు. అనంతరం బధిర విద్యార్థులకు ప్యాడ్లు, పండ్ల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి వెంకట్రావు తన వెన్నంటే ఉన్నారన్నారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు పార్టీ గెలుపు కోసం తీవ్రంగా కృషిచేశారని గుర్తుచేసుకున్నారు. పార్టీ గెలిచిన అనతికాలంలోనే వెంకట్రావు కన్నుమూయడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. వైఎస్సార్ సీపీలో సింగరాజు వెంకట్రావుది చెరిగిపోని చరిత్రగా పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, ఏపీ టైలర్ల వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షేక్ సుభానీ, కార్పొరేటర్లు ఈదర వెంకట సురేష్‌బాబు, ఇంతిజార్, యనమల నాగరాజు, హజ్ కమిటీ డైరెక్టర్ ఎస్‌ఎం బాషా, మైనార్టీ విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ సయ్యద్‌జలీల్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

వల్లూరమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు


వల్లూరమ్మ ఆలయంలో భక్తులు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌ను ఆలయ ప్రధాన అర్చకుడు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకుడు ఉమాశంకర్ ప్రత్యేకంగా అలకంరించి అభిషేకాలు, కుంకుమ పూజ, గోత్రనామార్చన నిర్వహించారు. వాహన పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా వల్లూరమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసులు, ఆలయ ఈఓ రమేష్ ఏర్పాట్లు చేశారు.

టెంట్ హౌస్ దగ్ధమై వ్యక్తి మృతి


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

- రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం

దర్శి: టెంట్‌హౌస్ దగ్ధమైన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన దర్శి పట్టణంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. దర్శికి చెందిన పోతంశెట్టి ప్రసాద్(45) గోల్డ్ షాపు నిర్వహిస్తుంటాడు. అతనికి చెందిన ఓ గదిని టెంట్ హౌస్‌కు అద్దెకు ఇచ్చాడు. ప్రసాద్ కుమారుడు విజయవాడలో చదువుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో విజయవాడ వెళ్లేందుకు బయలుదేరుతుండగా విరేచనాలు అవుతున్నాయని చెప్పడంతో భార్య, కుమార్తె వెళ్లారు. వారిద్దరూ విజయవాడ వెళుతుండగా బంధువులు ఫోన్ చేసి మీ టెంట్ దగ్ధమైందని, టెంట్ హౌస్‌లో ప్రసాద్ తీవ్ర గాయాలతో ఉన్నాడని చెప్పడంతో వారు వెంటనే తిరిగి వెళ్లారు. టెంట్ హౌస్ నుంచి మంటలు వస్తుండటంతో స్థానికులు షట్టర్ తీసి చూడగా కాలిన గాయాలతో ప్రసాద్ ఉన్నాడు. వెంటనే అతన్ని 108లో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందుకున్న వెంటనే వచ్చి మంటలు ఆర్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ప్రసాద్‌ను పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో ఒంగోలుకు తీసుకువెళ్లారు. ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రసాద్ గోల్డ్ షాప్ నిర్వహిస్తుంటాడు. అందరితో కలిసిమెలిసి ఆప్యాయంగా పలకరిస్తూ ఉంటాడు. ప్రసాద్ మృతితో కుటుంబసభ్యులు, స్నేహితులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు.

రూ.3లక్షల ఆస్తినష్టం..
మంటల్లో టెంట్ సామాగ్రి పూర్తిగా దగ్ధం కాగా రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని స్థానికులు చెబుతున్నారు. పక్కనే ఉన్న నివాసంలో కిటికీలు తగులబడి లోపలికి మంటలు వ్యాపించాయి. టీవీ, ఇతర సామగ్రి కాలిపోయాయి.

జగనన్నకు తోడుగా నిలవాలి

- గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

రాచర్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, భవిష్యత్తులో కూడా అందుతాయనే నమ్మకం ప్రజల్లో ఉందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని ఆకవీడు గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధిదారులు జగనన్నపై పూర్తి విశ్వాసంగా ఉన్నారని తెలిపారు. దేశంలోనే గొప్ప సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న జగనన్నకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలన్నారు. కుల, మత, వర్గ, రాజకీయ వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. జగనన్న పాలనలో మంచి జరిగిందంటేనే ఆశీర్వదించమని కోరుతున్నామన్నారు. నాయకులు ప్రజల ఇళ్లను నేరుగా సందర్శించి వారితో వ్యక్తిగతంగా మాట్లాడినప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి అంటే ఏంటో చూడగలమన్నారు. ప్రతి నెలా 1వ తేదీ పింఛన్ పొందుతున్న వృద్ధుల ఆనందం, అమ్మ ఒడి లబ్ధిదారుల చిరునవ్వులు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలని, ఆ దిశగా అందరూ ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. నవరత్నాలు, ఇతర హామీలు వందశాతం నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి తోడుగా నిలవాలన్నారు. రెండోరోజు ఆకవీడు సచివాలయం–1 పరిధిలో 441 ఇళ్లను ఎమ్మెల్యే అన్నా రాంబాబు సందర్శించారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ ఖాశింబీ, ఆకవీడు సర్పంచ్ తలపాటి దేవదానం, ఎంపీటీసీ నందం రవికుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ సూర పాండురంగారెడ్డి, ఎంపీడీవో కె.కవితా చౌదరి, వైఎస్సార్ సీపీ నాయకులు అన్నా రంజిత్, పగడాల శ్రీరంగం, బి.లింగన్న, పంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణ, గృహసారథులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

దభోల్కర్ స్ఫూర్తిని కొనసాగించాలి


దభోల్కర్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న నార్నె వెంకటసుబ్బయ్య

ఒంగోలు టౌన్: మూఢనమ్మకాల నిర్మూలన కోసం నిరంతరాయంగా పోరాడిన డాక్టర్ దభోల్కర్ స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఉందని ఏపీ హేతువాద సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నార్నే వెంకట సుబ్బయ్య అన్నారు. స్థానిక మల్లయ్యలింగం భవనంలో ఆదివారం నిర్వహించిన డాక్టర్ దభోల్కర్ 10వ వర్ధంతి సభకు ఆయన అధ్యక్షత వహించారు. మహారాష్ట్రలో 30 సంవత్సరాలకుపైగా మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా బలమైన గొంతు వినిపించిన దభోల్కర్‌ను మతతత్వ శక్తులు 2014 ఆగస్టులో కాల్చిచంపాయని ఆవేదన వ్యక్తం చేశారు. దభోల్కర్ ఆలోచనలను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేయడం ఒక్కటే దభోల్కర్‌కు నిజమైన నివాళి అవుతుందని హేతువాద సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంకే బేగ్ అన్నారు. స్కూలు విద్యార్థుల నుంచే చిన్నారుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉపాధ్యాయ సంఘ నేత జాలాది మోహన్ పిలుపునిచ్చారు. అనంతరం దభోల్కర్‌తో పాటు మతోన్మాదుల చేతుల్లో హత్యకు గురైన సంఘ సేవకుడు పన్సారే, విద్యావేత్త కల్బుర్గి, జర్నలిస్ట్ గౌరీలంకేష్‌లకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాచర్ల రావ్, పిచ్చయ్య, యార్లగడ్డ మధుబాబు, పీవీఆర్ చౌదరి, గుమ్మళ్ల నరసింహారావు, పోతినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో పథకాల లబ్ధిదారులు

- గడపగడపలో మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి: సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా రాష్ట్రం ముందుకు సాగుతోందని, ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఉన్నారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఆదివారం పొదిలి మండలంలోని మూగచింతల గ్రామంలో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు సిరుమల్లె కోటేశ్వరరావు (కోటి) ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రతి గడపలోనూ పథకాల లబ్ధిదారులు ఆనందంగా ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. గ్రామంలో మంచినీటి సమస్య గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే.. తక్షణమే పరిష్కరిస్తామన్నారు. మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.1.30 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. తాత్కాలికంగా బోర్లు వేయించి నీటి సమస్య తీరుస్తామన్నారు. ఇతర సమస్యలను కూడా ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించి అభివృద్ధి చేస్తామన్నారు. తగినన్ని నిధులు కేటాయించి గ్రామ సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన వ్యక్తిగత సమస్యలపై సైతం ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ దేవరపు చిన్నమ్మి, సొసైటీ అధ్యక్షుడు కామసాని వెంకటేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు దేవరపు వెంకటేశ్వర్లు, శేషారెడ్డి, ఆంజనేయరెడ్డి, ఎంపీడీవో శ్రీకృష్ణ, ఈవోఆర్డీ రాజశేఖర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

యోగాలో విద్యార్థుల ప్రతిభ

పీసీపల్లి: పీసీపల్లికి చెందిన విద్యార్థులు యోగాలో ప్రతిభ చూపారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒంగోలులో జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో 10–12 ఏళ్ల బాలికల విభాగంలో పెద్దవరిమడుగు పాఠశాలకు చెందిన స్వర్ణ, అశ్విని ద్వితీయస్థానం, 8–10 వయస్సుల బాలికల విభాగంలో మృదుల ప్రథమస్థానం, కె.సాయి సహస్ర ద్వితీయస్థానం, పీసీపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 10–12 ఏళ్ల బాలుర విభాగంలో ఏడుకొండలు, రేవంత్ సాయి ద్వితీయ, తృతీయ స్థానాలు, 12–14 ఏళ్ల బాలుర విభాగంలో సాయి సంజయ్ ద్వితీయస్థానం, 14–16 ఏళ్ల బాలుర విభాగంలో టి.గణేష్ ద్వితీయ స్థానంలో ప్రతిభకనపరిచారు. వీరంతా సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారు.

వీరిని ఈ స్థాయిలో ప్రతిభ కనపరిచే విధంగా తీర్చిదిద్దినటువంటి యోగా గురువు స్వర్ణ రమణయ్యను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.